# నిశాచరుడు - 2



## మధుబాబు

**NISAACHARUDU - 2**
(Serialised in 'Navya' weekly)
By
**MADHUBAABU**

Published by:
**MADHU PRIYA PUBLICATIONS**
Machavaram, Vijayawada - 520 004
Phone : 94411 94605

First Edition :
**2019**

Price :
**Rs. 110-00**

Cover Design :
**DURGA RAO**

Printers :
**SRI CHAITANYA OFFSET PRINTERS**
Vijayawada-2

# నిశాచరుడు - 2

మొహం మీద చల్లటి నీళ్ళు చిలకరింపబడేసరికి తెలివి వచ్చింది శంభుడికి.

"నేను ఎక్కడ ఉన్నాను?" ఒక్క క్షణంపాటు తను ఎక్కడ ఉన్నాడో తెలియకపోవడం వల్ల, అస్పష్టంగా అడుగుతూ లేచి కూర్చోబోయాడు.

వెంటనే అతన్ని ఆపింది ఒక బలిష్టమైన చేయి.

కనులు విప్పార్చుకుని చూసిన శంభుడికి కనిపించాడు మధ్య వయస్కుడు. "అనుకోనివిధంగా ప్రత్యక్షమై అల్లకల్లోలాన్ని సృష్టించిన దుష్ట స్వరూపాల్ని చూసి నువ్వు భయంతో మూర్ఛపోయావు" అన్నాడు.

జరిగింది ఏమిటో అప్పుడు గుర్తుకు వచ్చింది శంభుడికి. "నా పొట్టేళ్ళు ఏమైపోయాయి?" ఆందోళన నిండిన కంఠంతో అడుగుతూ, మధ్యవయస్కుడు అంతకుముందు మాదిరిగా అడ్డుకోబోయినా లెక్కచేయ కుండా లేచి కూర్చున్నాడు.

వెంటనే చిన్నచిన్న శబ్దాలు చేస్తూ అతని మొహంలో మొహాలు పెట్టాయి పక్కనే ఉన్న పొట్టేళ్ళు.

గుండెల మీదినుంచి కొండంత బరువు దిగిపోయినట్టు తేలికగా నిట్టూరుస్తూ, వాటి కొమ్ముల్ని తడిమాడు శంభుడు.

అవి వికృతాకారాల మీదికి ఎగబడిన సమయంలో ఆ కొమ్ములమీద ప్రత్యక్షం అయిన మంటలు ఇప్పుడు లేవని అర్థం అయ్యేసరికి మరింతగా కుదుటపడింది అతని అంతరంగం.

అయితే అదే సమయంలో అతనికి గుర్తుకువచ్చింది మరో దృశ్యం. “వృషభాలు... శకటాల్ని నడిపించే వృషభాలు ఎలా ఉన్నాయి?” అణగి పోయిందని అనుకున్న ఆందోళన మరోసారి గుండెల్ని పిండివేస్తుండగా అడిగాడు.

“అవి కూడా క్షేమంగానే ఉన్నాయి. వాటితోపాటు మన సైనికులు కూడా క్షేమమే. ఎలా వచ్చాయో అలాగే తిరిగి భూమిలోకి దూరిపోయాయి ఆ దుష్టస్వరూపాలు....” చెప్పాడు మధ్యవయస్కుడు.

“ఎలా సాధ్యపడింది? ఎటువంటి నష్టము కలిగించకుండా అవి మాయమైపోవటం ఎలా జరిగింది?” ఆశ్చర్యంగా అడిగాడు శంభుడు.

ఎలా జరిగిందో తెలుసు అతనికి. తన పొట్టేళ్ళు క్షేమంగా ఉండాలని కోరుకున్నాడు తను. తన పొట్టేళ్ళను కాపాడటంతో ఆగలేదు తనలోని శక్తి. శకటాల దగ్గర ఉన్న వృషభాలను కూడా రెచ్చగొట్టింది. అలా చేయాలని తను అనుకోకపోయినా అదే జరిగింది.

అడవిలో ఉన్నప్పుడు చెరువులోని ఒక చేపను కాపాడటం కోసం తను చేసిన ప్రయత్నం అందులోని చేపలన్నింటినీ రెచ్చకొట్టినట్లే ఇక్కడ కూడా జరిగింది.

తనకు స్పృహ తప్పకుండా ఉన్నట్లయితే, ఇంకా ఇంకా రెచ్చిపోయి ఉండేది ఆ శక్తి. ఆ చుట్టుపట్ల ఉన్న జంతువులనన్నిటినీ తీసుకువచ్చి ఆ వికృతరూపాల మీదికి ఉసికొల్పేది.

తనంతట తనుగా ఆ శక్తిని అదుపుచేయలేక, నిస్సహాయంగా చూస్తూ ఉండిపోవాల్సి వచ్చేది. తెలివితప్పి పడిపోవటం తన అదృష్టం.

"ఏమిటి ఆలోచిస్తున్నావు? ఆ వికృతరూపాల గురించా?" అని మధ్య వయస్కుడు అడగటంతో తన ఆలోచనల నుంచి బయటపడి, తల అడ్డం తిప్పాడు అతను.

తను సంకల్పించిన పనుల్నే కాకుండా, తను అనుకోని పనుల్ని కూడా చిటుకు చిటుకున చేసి చూపిస్తున్న తన శక్తిని తనంతట తనుగా అదుపు చేసుకోలేకపోతున్నాడు. అది దారుణంగా రెచ్చిపోతున్న సమయంలో మరేదో శక్తి తనకు తెలివితప్పించి కనులు తేలవేసేటట్టు చేస్తోంది. తనకు తెలివి తప్పటంతో తన శక్తి తనంతట తనే మటుమాయం అయిపోతోంది.

ఒక విధంగా అది మంచి పరిణామమే అయినా, అభిలషించదగినది మాత్రం కాదు. ఎక్కడో శకటాల దగ్గర ఉండవలసిన వృషభాలు తమంతట తాముగా ఆ వికృతాకారాలను ఎదిరించటానికి రావటం వరకూ బాగానే ఉన్నది కాని, అవి అంతటితో ఆగకుండా తమకు కనిపించిన వారందరి మీదికి దూసుకుపోవటం మొదలుపెడితే మాత్రం బీభత్స దృశ్యాల్ని చూడవలసి వచ్చేది.

ఏది ఏమయినా తను మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉంది. ఇంక ఎంత మాత్రము ఆలస్యం చేయకూడదు. వెంటనే కురంగి నగరం వైపు వెళ్ళిపోవటమే చాలా మంచిది.

తన పక్కనే నిలబడి ఉన్న పొట్టేళ్ళ తలల్ని తడుముతున్న తన చేయి ఉన్నట్లుండి చల్లగా మారిపోయినట్లు, తీవ్రమైన చలిగాలి వీస్తున్నట్టు శరీరంలో వణుకు మొదలవుతున్నట్లు అనిపించేసరికి ఉలిక్కిపడ్డాడు అతను.

"నాకు ఏదో అయిపోతోంది. కళ్ళు మళ్ళీ బైర్లు కమ్ముకున్నాయి" తడి ఆరిపోయిన కంఠంతో అంటూ, లేచి కూర్చున్నవాడు కాస్తా వెనక్కి పడిపోయాడు.

"పిలిపించండి. వైద్యుడు ఇంతకుముందే అవతలికి పోయాడు. వెంటనే రమ్మని చెప్పండి" శంభుడి చేతిని గట్టిగా పట్టుకుంటూ బిగ్గరగా అరిచాడు మధ్యవయస్కుడు.

నడి శీతాకాలపు సమయంలో పర్వతశిఖరాల మీద ప్రత్యక్షం అయ్యే మంచుగడ్డల మాదిరి అతిచల్లగా మారిపోతున్నది శంభుడి శరీరం. కళ తప్పిపోయింది వదనం.

వికృతాకారాలు ప్రత్యక్షం అయినప్పుడు వాటిని చూసిన భయంతో అడ్డువచ్చిన ఒక శిథిల వృక్షం మీదినుంచి అవతలికి దూకబోయి, ఎడమ పాదానికి పెద్ద దెబ్బ తగిలించుకున్నాడు ఒక సైనికుడు. బాధను భరించటం అసాధ్యమై, మెలికలు తిరిగిపోతున్నాడు.

అతని దగ్గరికి పోయి ఉన్నాడు వైద్యుడు. నెత్తురుతో మలినపడి ఉన్న గాయాన్ని శుభ్రం చేసి, ఏదో భస్మాన్ని ఆ దెబ్బ మీద జల్లి, పరిశుభ్రమైన వస్త్రంతో కట్టు కడుతున్నాడు.

చేస్తున్న పనిని మధ్యలోనే వదిలేసి పరుగు పరుగున వచ్చేశాడు శంభుడు పడి ఉన్న ప్రదేశంలోకి.

"శీతలం కమ్ముతోంది. వికృతాకారాల్ని చూసిన భయం క్షణక్షణానికి అధికం అయిపోతున్నట్టుంది. ధైర్యం చెప్పాలి. భయపడవలసిన అవసరం లేదని అతన్ని నమ్మించాలి" అంటూ తన మందుల సంచిలో నుంచి ఏదో తైలాన్ని తీసి, అతని అరికాళ్ళకు, అరిచేతులకు పట్టించటం మొదలుపెట్టాడు.

"మనం క్షేమంగానే ఉన్నామని, మనవారందరూ ప్రమాదం నుంచి తప్పించుకున్నారని నీకు ఇంతకు ముందే చెప్పాను. వెళ్ళిపోయాయి ఆ దుష్టస్వరూపాలు మటుమాయం అయిపోయాయి. ప్రమాదం తప్పిపోయింది" శంభుడి చెవి దగ్గర బిగ్గరగా అరవటం మొదలుపెట్టాడు మధ్యవయస్కుడు.

కళ్ళు తెరిపిళ్ళు పడకపోయినా, తనకు లేచి కూర్చునే శక్తి లేకపోయినా, తలను మాత్రం అటూ ఇటూ కదిలిస్తూనే ఉన్నాడు శంభుడు.

అప్పటివరకూ ఒక పక్కన నిలబడి, మౌనంగా చూస్తూ ఉన్న మహారాణి ఉన్నట్లుండి మధ్యవయస్కుడి భుజం మీద చెయ్యి వేసింది.

"ఇతని పెదవులు ఎండిపోతున్నట్టు కనిపిస్తున్నాయి. శరీరంలో నీటిశాతం తగ్గిపోయినట్టు చర్మం ముడతలు పడిపోతోంది. సరిగ్గా చూడండి" అంటూ హెచ్చరించింది.

సరిగ్గా అదే సమయంలో ఆ ప్రదేశంలోకి అడుగుపెట్టాడు సైనికులతో పాటుగా వచ్చిన మంత్రవాది.

తన దగ్గర ఉన్న మంత్రదండం వంటి ఒక సాధనంతో హఠాత్తుగా ప్రత్యక్షం అయిన వికృత రూపాల్ని అడ్డుకోవటానికి ప్రయత్నం చేసి, ఒక

రూపం తనమీదికి దుమికి గుండెల్ని గాయపరచటంతో, దూరంగా పారిపోయి ప్రాణాలు దక్కించుకున్న ఘనుడు అతను.

"తల్లీ... ఇది వైద్యులవారు భావిస్తున్నట్టు శరీరానికి సంబంధించిన జాడ్యం కానట్టు కనిపిస్తోంది. మంత్రశక్తుల మహిమ అతన్ని వివశుడిని చేస్తోంది. ముందు అతనిచేత నీటిని తాగించండి" కనులు చిట్లించి శంభుడి వాలకాన్ని నిశితంగా పరిశీలించిన తర్వాత అతను వెలిబుచ్చిన అభిప్రాయం అది.

క్షణికం పాటు కూడా ఆలస్యం చేయలేదు మధ్యవయస్కుడు. పెద్ద కంచుపాత్రలో నీటిని తెప్పించి శంభుడి పెదవులకు అందించాడు.

శంభుడి కరచరణాలకు తైలమర్దనం చేస్తున్న వైద్యుడు అందుకు అభ్యంతరం వెలిబుచ్చబోయాడు.

"శీతలం కమ్ముతున్న మనిషి చేత చల్లటి నీరు సేవింపచేస్తే పరిస్థితి చేయిదాటిపోతుంది. మరణించటం వెనువెంటనే జరిగిపోతుంది. ఆగిపోండి" అంటూ మధ్యవయస్కుడిని వారించబోయాడు.

అతని చేతుల్ని విదిలించేశాడు మధ్యవయస్కుడు. నీటిపాత్రను అలాగే శంభుడి పెదవుల దగ్గర పెట్టి ఉంచాడు.

దారుణమైన ఎడారిలో ప్రయాణం చేసిన మనిషి దాహంతో గిలగిలలాడిపోతున్నట్టు ఆబగా నీటిని తాగాడు శంభుడు. కంచుపాత్ర ఖాళీ అయిపోయింది. "ఇంకా ఇంకా కావాలి. నా నోరు ఎండుకుపోతోంది" అస్పష్టంగా వెలువడ్డాయి మాటలు అతని నోటినుంచి.

ఇంకో పాత్రను తెప్పించాడు మధ్యవయస్కుడు. అది కూడా వాడుకోగానే మరొకటి... మొత్తం నాలుగు పాత్రల నీటిని సేవించిన తర్వాత మెల్లగా తెరుచుకున్నాయి శంభుడి కనులు.

"ఆకలి వేస్తోంది. ఆకలితో నా కళ్ళు గిర్రుగిర్రున తిరిగిపోతున్నాయి" చిన్నకంఠంతో చెపుతూ మెల్లగా తనంతట తనే లేచి కూర్చున్నాడు.

"నాకు తెలుసు. నేను ఉపయోగించిన కర్పూర తైలం ఇతన్ని కమ్ముకున్న శీతలాన్ని దూరంగా తరిమివేసింది. శరీరంలో అమితమైన

వేడిమి ఉద్భవించి దాహం, ఆకలి అధికంగా కనిపిస్తున్నాయి" తను చేస్తున్న పనిని ఆపి, సగర్వంగా ప్రకటించాడు వైద్యుడు.

"మనల్ని హింసించటానికి ప్రత్యక్షం అయిన వికృతరూపాల దృష్టి ఈ కుర్రవాడిమీద కేంద్రీకరింపబడింది. వాటినుంచి వెలువడిన మంత్ర సంబంధ తరంగాలు ఈ అలజడిని సృష్టించాయి" తను అతని పరిస్థితిని అంచనా వేయటం వల్లనే, అతను తేరుకోవటం జరిగిందన్న భావనతో పెద్ద కంఠంతో చెప్పాడు మంత్రవాది.

ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు మహారాణి, మధ్యవయస్కుడు. "సరయిన సమయంలో చక్కటి మాటలు చెప్పి పరిస్థితిని చక్కదిద్దిన మీరిద్దరూ శ్లాఘనీయులే. అవసరం అయితే మరోసారి మీకు వర్తమానం అందిస్తాము" అంటూ చేయి ఊపాడు మధ్యవయస్కుడు.

తమతో అవసరం తీరిపోయిందని అతను భావిస్తున్నట్టు అర్థం చేసుకుని, గబగబా అవతలికి వెళ్ళిపోయారు వారిద్దరూ.

"తల్లీ... శాకాహారమా? మాంసాహారమా?" శంభుడి మాటల్ని ఆలకించిన వంటమనిషి చిన్నగా అడగటంతో మళ్ళీ మధ్యవయస్కుడి వైపు చూసింది మహారాణి.

"శాకాహారమే. ఇప్పుడున్న ఈ నీరస పరిస్థితిలో మాంసాహారాన్ని ఇతను జీర్ణించుకోలేడు" అన్నాడు అతను.

వికృతాకారాలు ప్రత్యక్షం కాకముందు ఎటువంటి పదార్థాన్ని వారికి తినబెట్టారో, ఆ పదార్థాన్నే మరోసారి తీసుకువచ్చాడు వంటమనిషి.

ఆరగించమని మహారాణి గాని, మధ్యవయస్కుడు గాని తనకు చెప్పకముందే, బాసింపట్టు వేసుకు కూర్చున్నాడు శంభుడు. వంచిన తలను ఎత్తకుండా ఒకదాని తర్వాత ఒకటిగా నాలుగు పాత్రల నిండుగా ఉన్న ఆహారాన్ని అతికొద్ది సేపటిలో ఆరగించేశాడు.

"ఇతను మనిషి కాదు, పిశాచం. ఒకేసారి నాలుగు పాత్రల ఆహారాన్ని ఆరగించటం అంటే మాటలు కాదు. మాయమైపోయాయని మనం అనుకుంటున్న ఆ దుష్టస్వరూపాల్లో ఒకటి ఇతన్ని ఆవహించే ఉంటుంది.

సందేహం లేదు" సన్నగా గొణిగాడు, కొంచెం అవతలగా నిలబడి ఉన్న సైనికుల నాయకుడు.

ఆ మాటలు మహారాణికి వినబడలేదు. మధ్యవయస్కుడికి చేరలేదు. ఆఖరి పాత్రను అవతలికి నెడుతున్న శంభుడి చెవులకు మాత్రం స్పష్టంగా చేరాయి.

చిన్నబోయింది అతని వదనం ఒక్కసారిగా. "అతి భయంకరమైన అడవిలోనుంచి బయటపడేటప్పుడు మీరు తోడుగా ఉండటం నా అదృష్టం. ఇక నాకు సెలవు ఇప్పించండి. నేను నా ప్రయాణాన్ని కొనసాగించుకోవాలి" అంటూ చటుక్కున లేచి నిలబడ్డాడు.

"నువ్వు ఎవరివో, నీ నామధేయం ఏమిటో కూడా తెలియకుండా రోజులకు రోజులు మనం ఒకటిగా కలిసి ప్రయాణం చేశాము. నీ ముందు చూపు కారణంగా, నీ తెలివితేటల మూలకంగా ఆ దుష్టదుర్మార్గులైన బందిపోట్ల బారినుంచి బయటపడగలిగాము. ఏడు అడుగులు కలిసి నడిస్తేనే అపరిచితులు కూడా ఆత్మీయులైపోతారని పెద్దలు చెప్పిన మాట. నువ్వు ఆ మాటకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నావు" ఉన్నట్లుండి అన్నది మహారాణి.

అతిశయం లేదు ఆ మాటల్లో. అతన్ని అభిశంసిస్తున్నట్టుగా కూడా లేవు ఆ మాటలు.

ఎందుకో తమ గ్రామంలోని స్త్రీలు అందరూ తనను చేరి ఆపేక్షగా పలుకరించినట్టు అనిపించి, గిర్రున తిరిగాయి శంభుడి కళ్ళలో నీళ్ళు.

"అరే... ఏమిటి ఈ నిర్వేదం? ఏమయింది నీకు?" మరింత ఆప్యాయంగా అడుగుతూ అతని తలను నిమిరింది మహారాణి.

ఆపైన ఆగలేకపోయాడు శంభుడు. అంతకు ముందు తను తీసుకున్న నిర్ణయానికి విరుద్ధంగా నోరు విప్పాడు.

"అమ్మా... నా పేరు శంభుడు. నేను కురంగి నగరానికి ప్రయాణం అయ్యాను. దారిమధ్యలో అఘోరుడు అనే మంత్రవాదిని తప్పించుకోవటానికి ప్రయత్నం చేస్తూ ఉండగా మీకు పరిచయం అయ్యాను" తనకు తెలియకుండానే తన గురించి చెప్పేశాడు.

అఘోరుడి పేరు చెవులపడిన వెంటనే ఉలిక్కిపడినట్లయి, వెంటనే తమాయించుకున్నాడు మధ్యవయస్కుడు.

"మనం వెంటనే మన నగరానికి ప్రయాణమవటం చాలా మంచిది తల్లీ" అన్నాడు.

"శకటాలను సిద్ధం చేయండి. ఇంకొక్కక్షణం కూడా మనం ఈ ప్రదేశంలో నిలబడకూడదు" బిగ్గరగా ఆజ్ఞ ఇచ్చింది మహారాణి.

నిశ్చలంగా నిలబడి ఉన్న సైనికుల్లో వెంటనే వచ్చింది కదలిక. అంతకుముందు తమను చీల్చి చెండాడటానికి ప్రత్యక్షం అయిన వికృతాకారాలు, మరోసారి తమ ఎదుటికి వచ్చినట్లు గడబిడలు చేస్తూ కదిలారు. మహారాణికోసం సిద్ధం చేసిన పటకుటీరాన్ని క్రిందికినెట్టి మడతలు పెట్టారు కొందరు. తీరికగా కూర్చోవటానికి అనువుగా ఉండే చెక్కబల్లలను శకటాలమీదికి ఎక్కించారు. వంటపాత్రలతోసహా, క్రిందికి దించబడిన ఆహారపదార్థాలు కూడా చేర్చబడ్డాయి శకటాలమీదికి.

మహారాణి నోటివెంట ఆజ్ఞ వెలువడిన పావుఘడియలో వెనుతిరిగి, తమ నగరంవైపు ప్రయాణం మొదలుపెట్టారు అందరూ.

బలిష్ఠమైన అశ్వాలను అధిరోహించారు మహారాణి, మధ్యవయస్కుడు. తనకోసం సిద్ధం చేయబడిన అశ్వాన్ని, సున్నితంగా తిరస్కరించాడు శంభుడు.

"అలవాటు లేదు. అశ్వం మీద కూర్చుని ప్రయాణం చేయటం అసలు నాకు చేతకాదు" అంటూ కాలినడకనే వారి వెనుక బయలుదేరాడు.

మూడువందల ధనువుల దూరం వెళ్ళిన తర్వాత, మహారాణికి సైగ చేశాడు మధ్యవయస్కుడు. 'వెనక్కి చూడండి తల్లీ...' చిన్న కంఠంతో చెప్పాడు.

తల వెనక్కి తిప్పి చూసింది మహారాణి.

హాయిగా ఆనందంగా అడుగులు వేస్తూ వారిని అనుసరిస్తున్నాడు శంభుడు. అతన్ని ఆనుకుని నడుస్తున్నాయి పొట్టేళ్ళు. వాటికి మూడు అడుగుల వెనుకగా తను కూడా వస్తోంది, అతనికోసం సిద్ధం చేయబడిన అశ్వం. అమితమైన ఆరాధన ప్రతిఫలిస్తోంది దాని కనులలో. అతనే తనకు

యజమాని అయినట్టు, అతన్ని అనుసరించటమే తన కర్తవ్యం అన్నట్లు ప్రవర్తిస్తోంది అది.

✣ ✣ ✣ ✣ ✣

"నీ కోరిక నెరవేరినట్టే కనిపిస్తోంది ఆఘోరుడా! మేము ప్రయోగించిన ధూమపిశాచం ఎవరినో బంధించి తీసుకువస్తోంది." వికవికమని నవ్వుతూ, తమ కుటీరంలోనుంచి బయటికి వచ్చింది ఒక వికృత రూపిణి.

కుటీరం ముందు చెక్కబల్ల మీద కూర్చుని, ఒక సొరకాయబుర్ర నుంచి పసందయిన ద్రాక్ష ద్రవాన్ని సేవిస్తున్న అఘోరుడికి పరమానందమై పోయింది.

"మీ మేలు ఎన్నటికీ మర్చిపోలేను. నిజమైన ఆత్మీయులు మీరు" అంటూ సొరకాయబుర్రను కిందపెట్టి చెక్కబల్ల మీది నుంచి లేచాడు.

ఈదురుగాలి వీచిన సవ్వడి వినిపించింది. నలుపురంగు పొగ గిర్రుగిర్రున తిరుగుతూ కుటీరం దగ్గిర ప్రత్యక్షమైంది. అందులోనుంచి అతి బలంగా విసిరివేయబడినట్లు ఇవతలికి వచ్చిపడింది ఒక అశ్వశకటం, అశ్వాలతో సహా.

"అద్భుతం మహాద్భుతం పసందయిన ఆహారం. పదిరోజులపాటు తృప్తికరంగా భుజించవచ్చు" అంటూ గంతులు వేసి, తన చేతుల్ని ఊపింది వికృతరూపిణి.

ధూమవలయంలో నుంచి బయటికి విసిరి వేయబడిన వెంటనే, శకటంతోసహా దూరంగా పరిగెత్తే ప్రయత్నాన్ని మొదలుపెట్టబోతున్నాయి అశ్వాలు. బలమైన దెబ్బలు తమ తలలమీద పడినట్లు వికృతంగా సకిలించి నేలకూలిపోయాయి. వాటి నాశికాలలో నుంచి ఎర్రటి రక్తం వెల్లువలా బయటికి వచ్చి నేలమీద మడుగు కట్టడం ప్రారంభం అయింది.

"అయ్యయ్యో... అవి వట్టి అశ్వాలు మాత్రమే. వాటితోపాటుగా మనిషి అనేవాడు ఎవడూ లేడు" తనకు కావల్సిన మనిషి కనిపించక పోవటంతో, నిరాశగా అన్నాడు అఘోరుడు.

"తొందరపడకు స్నేహితుడా... నిదానించు. ఇది ఆరంభం మాత్రమే...." పరుగుపరుగున పడిపోయిన అశ్వాల దగ్గరికిపోయి, నేలమీద

మడుగు కడుతున్న వాటి రక్తాన్ని దోసిటిలోకి తీసుకుంటూ చెప్పింది ఆ వికృతరూపిణి.

"అవకాశం లభించిందన్న ఆనందంతో నువ్వు ఒళ్ళు మరిచి ప్రవర్తిస్తున్నావు. నీ సోదరిని నేను ఒకదాన్ని ఉన్నానని మరిచిపోతున్నావు. రుచికరమైన ఆ అమృతాన్ని నువ్వు ఒక్కదానివే తాగేయకు. నాకు కూడా మిగుల్చు" అంటూ కుటీరంలోనుంచి బయటికి వచ్చింది రెండవ ఆడమనిషి.

అధికం అయిపోయింది అఘోరుడి అసహనం. తనకు కావాల్సిన మనిషి ఒకవేళ ఆ శకటంలో దాక్కుని ఉన్నాడేమోనన్న అనుమానంతో, ముందుకు కదలబోతుండగా, మరోసారి వినవచ్చింది ఇంకో శబ్దం, గిర్రుగిర్రున తిరుగుతున్న పొగలోనుంచి.

వడిసెలలో నుంచి వెలువడిన గులకరాళ్ళ మాదిరి వేగంగా ఇవతలకు విసిరివేయబడ్డారు బలంగా కనిపిస్తున్న బందిపోటు దొంగలు.

అఘోరుడు చూస్తూవుండగానే, రెండు సంఘటనలు అతివేగంగా జరిగిపోయాయి. ఆలోచించు కోవటానికి, నెమ్మదిగా మాట్లాడటానికి కొంచెం కూడా అవకావం అతనికి లభించలేదు.

సుడులు తిరుగుతున్న ధూమంలోనుంచి బయటపడిన వెంటనే, అశ్వశకటం దగ్గర ఉన్న ఆడ మనుషులను గమనించాడు బందిపోటు నాయకుడు.

"అయ్యబాబోయ్... మన కర్మకాలిపోయింది. వచ్చివచ్చి ఈ పిశాచాల దగ్గరపడ్డాము. ఆలస్యం చేస్తే మనల్ని పీక్కుతినేస్తాయి. మంత్రాలు చదివి మనల్ని వివశుల్ని చేసేస్తాయి. చంపేయండి" అని అరుస్తూ ముందుకు దూకాడు.

శంబంగి శిఖరానికి సమీపంలో నివసించే ఆ మాంత్రికురాళ్ళను గురించి అతనికి పూర్తిగా తెలుసని అఘోరుడికి అర్థం అయిపోయింది.

"ఆగండి... ఆగిపోండి... వాళ్ళు మీకు శత్రువులు కాదు...." అని బిగ్గరగా హెచ్చరించాలని అనుకున్నాడు కాని, మాటలు అతని నోటినుంచి బయటికి రాకముందే, తమ నాయకుడితో పాటుగా తాము కూడా ముందుకు దూకారు మిగిలిన బందిపోట్లు.

నేలమీద మడుగులు కడుతున్న రక్తం, నేలలోకి ఇంకిపోకముందే, ఆబగా తాగేస్తున్న వికృత రూపిణులకు ముంచుకు వచ్చింది కోపం.

"మమ్మల్నే ఎదిరించటానికి బయలుదేరతారా? మీరెంత? మీ బతుకులు ఎంత?" అంటూ గబుక్కున లేచి గట్టిగా హరాంకరించింది ఒకర్తె.

భగ్గుమంటూ పైకి లేచాయి మంటలు.

"అయ్యయ్యో... ఆగండి... వాళ్ళని ఏమీచేయకండి" గొంతు పెగుల్చుకుని అరిచాడు అఘోరుడు.

అప్పటికే ఆలస్యం అయిపోయింది. పైకి లేచిన మంటలు గప్పుగప్పున చుట్టుముట్టాయి బందిపోట్లు అందరినీ. గావుకేకలు పెడుతూ తలా ఒక పక్కకు పరుగులు తీయటానికి ప్రయత్నం చేశారు వాళ్ళు.

ఉపయోగం ఏమీ లేకపోయింది. మాడి మసయిపోయారు. కనులుమూసి తెరిచేలోపల పెద్దపెద్ద బూడిద గుట్టలుగా మారిపోయారు.

"ఎంతపని చేశావు? అడవిలో సంచరిస్తూ ఉండే ఈ అధమాధములకు తప్పకుండా తెలిసే ఉంటుంది నాకు కావాల్సిన మనిషిని గురించి. కనీసం ఒక్కమాట కూడా మాట్లాడే అవకాశం ఇవ్వకుండా మాడ్చి మసి చేసేశావు" నీరసంగా అంటూ వెనుతిరిగి తను కూర్చున్న చెక్కబల్ల దగ్గరికి పోయాడు అఘోరుడు.

రక్తంతో మలినమైన చేతుల్ని తమ వస్త్రాలకేసి రుద్దుకుంటూ అతని దగ్గరికి వచ్చారు ఆ ఆడమనుషులు ఇద్దరూ.

"నిరాశపడకు మిత్రుడా! ఈ అడవికి మేము రాణులం. వాళ్ళను ఇక్కడకు రప్పించినట్లే, నీకు కావాల్సిన మనిషిని కూడా రప్పించగలమని నీకు తెలుసు" అంటూ, తన కుడిపాదపు బొటనవేలితో నేలమీద ఏవో వంకరటింకర గీతలు గీసింది వారిలో ఒకర్తె.

"నీకు అవసరమైన మనిషిని తలుచుకో... వాడి ముఖాన్ని మనసులో నింపుకో... ఈ మంత్రపు ముగ్గులోకి తొంగిచూడు" చెప్పింది రెండవ మనిషి.

క్రిందపెట్టిన సొరకాయబుర్రను అందుకుని, అందులోని ద్రాక్ష ద్రవాన్ని తాగబోతున్న అఘోరుడికి వచ్చేసింది విపరీతమైన కోపం.

"మీకు బుద్ధిలేదు. ఎప్పుడు చూసినా తిండియావ తప్ప మరో ఆలోచన మీకు రాదు. నాకు కావల్సిన మనిషిని నా కళ్లతో నేను స్వయంగా చూసి ఉంటే, మీ దగ్గరికి వచ్చి ఇలా చేతకానివాడిలా కూర్చునేవాడిని కానే కాదు. వాడు ఎలా ఉంటాడో మాకు తెలియదు...." అంటూ ఉండగా, అశ్వశకటం దగ్గర ప్రత్యక్షం అయింది ఒక స్వరూపం.

"ఏరీ? ఈ శకటంలో పారిపోయి వచ్చిన నరమానవులు ఎక్కడ?" అని అడుగుతూ చుట్టూ చూసింది.

మంత్రగత్తెలిద్దరినీ పరుషమైన పదజాలంతో తిట్టిపోయదలుచుకున్న అఘోరుడికి చెమటలు పట్టేశాయి.

"నువ్వు ద్వాదశముఖివి. మహామంత్రవేత్త ధేనుకులవారి ఆధీనంలో ఉన్న మహాశక్తివి...." తడబడుతున్న కంఠంతో అన్నాడు.

ఎర్రగా జ్యోతుల మాదిరి ఉన్న ఆ స్వరూపం కనులు అతనివంక చూశాయి.

"ధేనుకులవారికి కావాల్సిన మనిషిని ఈ అశ్వ శకటంలో వచ్చిన మానవాధములు చూసి ఉన్నారు. వారిని వెంటబెట్టుకు రమ్మనమని ధేనుకులవారి ఆజ్ఞ. వారిద్వారా ఆ మనిషి జాడల్ని తెలుసుకోవచ్చని ఒక ఆలోచన" చెప్పింది అది.

"నువ్వు ఆలస్యంగా వచ్చావు. ఆ మానవాధములను మేము బూడిద గుట్టలుగా మార్చివేశాము" అన్నది అఘోరుడి దగ్గిర ఉన్నవారిలో ఒక మంత్ర గత్తె.

గావురుమని అరిచి, అమాంతం గాలిలోకి ఎగిరింది ఆ ఆకారం.

"అక్కా! ప్రమాదం... అతి ప్రమాదం...." అని అరుస్తూ, తన సోదరి చేతిని పట్టుకొని, కుటీరంవైపు పరుగుదీసింది రెండవ మంత్రగత్తె.

"ఆగు ద్వాదశముఖీ... దయచేసి ఆగు, వాళ్ళు మనకి శత్రువులు కాదు" అంటూ తన దగ్గర నేలను తాకిన ఆకారాన్ని నిలువరించటానికి ప్రయత్నించాడు అఘోరుడు.

నిలువలేదు అది. అతను చూస్తూ ఉండగానే, పదింతలు నిలువుకు ఎదిగిపోయింది. మర్రిచెట్టు కొమ్మల మాదిరి దృఢంగా ఉన్న బాహువుల్ని చాపి, కుటీరంలోకి పోబోతున్న మంత్రగత్తెలనిద్దరినీ పట్టుకున్నది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Nisacharudu+2**

* * *